క్లుప్తంగా

గర్భిణులకు వైద్య పరీక్షలు



గర్భిణులను పరీక్షిస్తున్న వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్

ఐరాల: స్థానిక పీహెచ్‌సీలో గర్భిణులకు బుధవారం వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ వైద్య పరీక్షలు నిర్వహించారు. క్రమం తప్పకుండా వైద్య పరీక్షలకు రావాలన్నారు. ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవాలు సురక్షితమన్నారు. కాన్పు చేయించుకున్న వారికి ప్రభుత్వం ప్రోత్సాహకాలు ఇస్తోందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో లో పంపిణీ చేసే పోషకాహారం సద్వినియోగం చేసుకుని రక్తహీనత సమస్య బారిన పడకుండా చూసుకోవాలన్నారు.

ఆర్టీసీ డిపోలో ట్రైనీ కలెక్టర్

చిత్తూరు రూరల్: చిత్తూరు ఆర్టీసీ టు డిపోను బుధవారం ట్రైనీ కలెక్టర్ మేఘ స్వరూప్ సందర్శించారు. డీపీటీఓ జితేంద్రనాథ్ రెడ్డితో కాసేపు మాట్లాడారు. ఆర్టీసీ విధివిధానాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బస్టాండ్, డిపో గ్యారేజ్‌లను తనిఖీ చేసి కార్మికులతో పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు.

గ్రామ సమస్యలపై దృష్టి పెట్టండి

చిత్తూరు రూరల్: గ్రామాల సమస్యలపై దృష్టి పెట్టి ఎప్పటికప్పుడు పరిష్కరించే విధంగా చూడాలని ఎంపీడీవో రాఘవేంద్ర వర్మ ఆదేశించారు. నగరంలోని తన కార్యాలయంలో ఆయన బుధవారం పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో పర్యటించాలన్నారు. అప్రమత్తంగా నిర్వహిస్తూ స్థానికంగా ఎదురయ్యే సమస్యలను తక్షణమే పరిష్కరించేలా చూడాలని చెప్పారు.

విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు



విద్యార్థినికి ప్రోత్సాహక బహుమతులు అందిస్తున్న ఉపాధ్యాయులు

యాదమరి: పదో తరగతి విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు ఇవ్వడం ఆనందకరమని మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల హెచ్‌ఎం గిరిరాజ ఆనందకరమన్నారు. పాఠశాలలో గత సంవత్సరం పదో తరగతిలో మంచి ఫలితాలు సాధించిన గీతికకు జీవశాస్త్ర ఉపాధ్యాయులు కృష్ణారెడ్డి రూ.18 వేలు, గణితం ఉపాధ్యాయురాలు సరస్వతి రూ.5వేలు అందించారు. ఈ నగదు ఆ విద్యార్థిని ఉన్నత చదువులకు ఉపయోగ పడుతుందన్నారు. హెచ్‌ఎం మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు ఉన్నాయని, మంచి ఫలితాలు సాధించాలని విద్యార్థులను కోరారు.

గృహ నిర్మాణంలో నిర్లక్ష్యం వద్దు



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ గౌరి

పూతలపట్టు: లబ్ధిదారులు జగన్న ఇళ్ల విషయంలో నిర్లక్ష్యం వహించరాదని ఎంపీడీఓ గౌరి అన్నారు. మండలంలోని తేనేపల్లి లేఅవుట్లను బుధవారం ఆమె పరిశీలించారు. ప్రభుత్వం కేటాయించిన స్థలంలోనే నిర్మాణ పనులు పూర్తిచేయాలని స్పష్టం చేశారు. పరిశీలించిన ఆమె లబ్ధిదారులతో మాట్లాడుతూ కొందరికి బిల్లులు మంజూరైనా వాటిని నిర్మాణ పనులకు ఉపయోగించడం లేదని చెప్పారు. నిర్దేశిత గడువులోపు నిర్మాణ పనులు పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ఉగాదినాటికి లేఅవుట్ ఇళ్ల నిర్మాణ పనులు పూర్తయ్యేలా ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు బాధ్యతగా పనిచేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ డీఈ సుబ్రమణ్యం, ఏఈ శ్రీనివాసులు, పంచాయతీ సెక్రటరీ లక్ష్మీ, లబ్ధిదారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మొగిలికి ప్రత్యేక సర్వీసులు

పలమనేరు: మొగిలి ఆలయానికి ఈనెల 18వ తేదీ శివరాత్రి సందర్భంగా పలమనేరు ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక సర్వీసులను నడపనున్నట్టు ఆర్టీసీ డీఎం రామకృష్ణ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా తమిళనాడు రాష్ట్రంలోని గుడియాత్తం నుంచి, పలమనేరు బస్టాండ్ నుంచి పలు ప్రత్యేక సర్వీసులను నడపనున్నట్టు పేర్కొన్నారు.

కూరగాయల వితరణ

పలమనేరు: శ్రీకాళహస్తి బ్రహ్మోత్సవాల సందర్భంగా నిత్యాన్నదాన పథకానికి స్థానిక శ్రీవారి సేవకులు కాబ్బల్లి రవీంద్రారెడ్డి బెంగళూరు మార్కెట్ నుంచి పది టన్నుల కూరగాయలను బుధవారం వితరణగా శ్రీకాళహస్తికి పంపించారు. ఆలయ నిర్వాహకుల ఆదేశాల మేరకు ఈ కూరగాయలను పంపినట్టు తెలిపారు.

మొగిలీశ్వరుని బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

- ఉత్సవాలను విజయవంతం చేద్దాం
- పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు
- మొగిలీశ్వరుని ఉత్సవాల నిర్వహణపై అధికారులతో సమీక్ష







బంగారుపాళెం: బ్రహ్మోత్సవాల నిర్వహణపై అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, మూషికవాహనంపై విఘ్నాధిపతి వినాయకుడు, తవణంపల్లె: ఉత్సవాలకు ముస్తాబైన కాలభైరేశ్వర దేవస్థానం

బంగారుపాళెం: శ్రీమొగిలీశ్వరస్వామి వారి శివరాత్రి బ్రహ్మోత్సవాలకు బుధవారం అంకురార్పణ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వయంభు శ్రీమొగిలీశ్వర స్వామి, కామాక్షమ్మ వారి మూల విగ్రహాలకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. సాయంత్రం అలంకార మండపంలో సర్వవిఘ్నాధిపతి వినాయక స్వామి ఉత్సవ విగ్రహాన్ని వివిధ రకాల పుష్పాలతో విశేషంగా అలంకరించారు. అనంతరం స్వామివారిని మూషిక వాహనంపై కొలువుదీర్చి ఆలయ మాడవీధుల్లో ఘనంగా ఊరేగించారు. మూషిక వాహన ఉత్సవానికి బంగారుపాళ్యానికి చెందిన సరస్వతి, సుధాకర్ నాయుడు ఉభయదారులుగా వ్యవహరించారు.

సమష్టిగా కృషి చేద్దాం

మండలంలోని శ్రీ కామాక్షి సమేత మొగిలీశ్వర స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలను సమష్టి కృషితో విజయవంతం చేద్దామని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు పిలుపునిచ్చారు. మొగిలి శివాలయ బ్రహ్మోత్సవాల నిర్వహణపై బుధవారం ఆలయ ఆవరణలో వివిధ శాఖల అధికారులతో ఎమ్మెల్యే సమీక్షించారు. బుధవారం నుంచి 25వ తేది వరకు నిర్వహించే బ్రహ్మోత్సవాలలో. మొగిలీశ్వరస్వామి, కామాక్షమ్మ వివిధ వాహనాలపై భక్తులకు దర్శనమిస్తారన్నారు. బ్రహ్మోత్సవాలకు పరిసర ప్రాంతాల నుంచే కాకుండా కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి సైతం భక్తులు రానున్న దృష్ట్యా తగు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా ట్రాన్స్‌కో అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అలాగే భక్తుల కోసం వైద్య సిబ్బంది శిబిరాన్ని ఏర్పాటు చేయాలన్నారు. అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పోలీసులు గట్టి బందోబస్తు కల్పించాలన్నారు. సమావేశంలో సర్పంచ్ మనోహరి, ఎంపీటీసీ శ్యామల, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ రామచంద్రారెడ్డి, జెడ్పీ మాజీ చైర్మన్ కుమార్‌రాజా, తహసీల్దార్ బెన్నురాజ్, ఎస్ఐ మల్లికార్జున్ రెడ్డి, ట్రాన్స్‌కో ఏఈ రామిరెడ్డి, కార్యనిర్వహణాధికారి మునిరాజ, వంశపారంపర్య ధర్మకర్త విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

> **నేడు ధ్వజారోహణం**
>
> మొగిలీశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం ఉదయం కలశస్థాపన, ధ్వజారోహణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. రాత్రి హంస వాహన సేవ కార్యక్రమాన్ని చేపట్టనున్నారు.

నేడు గృహ సారథులతో ఎమ్మెల్యే సమీక్ష

మండలంలోని గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతో గురువారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించనున్నట్లు మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ రామచంద్రారెడ్డి తెలిపారు. స్థానిక మార్కెట్‌యార్డు ఆవరణలో ఉదయం 10 గంటలకు నిర్వహించనున్న సమావేశానికి పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు హాజరు కానున్నారని తెలిపారు. సమావేశానికి సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, పార్టీ నాయకులు తప్పకుండా హాజరు కావాలని కోరారు.

పూతలపట్టులో..

పూతలపట్టు: మండల కేంద్రంలోని బాలాజీ కల్యాణ మండపంలో గురువారం వలంటీర్లకు, సచివాలయ కన్వీనర్లకు, రథసారథులకు అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు మండల కన్వీనర్ శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. మధ్యాహ్నం 2గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ఎంఎస్ బాబు హాజరు కానున్నట్లు తెలిపారు.

నేడు తవణంపల్లెలో..

శ్రీ కాలభైరేశ్వర స్వామి ధ్వజారోహణం

తవణంపల్లె: మండల కేంద్రంలో ఎత్తయిన బండపై వెలసిఉన్న శ్రీ కాలభైరేశ్వర ఆలయంలో మహాశివ రాత్రి వేడుకల్లో భాగంగా నేడు ధ్వజారోహణం నిర్వహించనున్నట్లు దేవదాయశాఖ అధికారి ఏకాంబరం , ఆలయ ఈఓ వెంకటసుబ్బారెడ్డి తెలిపారు. గురువారం ఉదయం ధ్వజారోహణం, స్వామికి అభిషేకం, అన్నాభిషేకం, రాత్రి 7 గంటలకు శేష వాహన సేవ ఉంటుందని పేర్కొన్నారు. ఈనెల 17న శుక్రవారం ఉదయం స్వామి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని వివరించారు. రాత్రి నంది వాహన సేవ, 18వ తేదీ ఉదయం అంకురార్పణం, కలశప్రతిష్ఠ, గణపతి హోమం, శివకోటినామ సంకీర్తన భక్తి శ్రద్ధలతో నిర్వహించనున్నారు. నందీశ్వరునికి అభిషేకం, సాయంత్రం 4 గంటలకు మృత్యుంజయ హోమం, 5 గంటలకు లలిత సహస్రనామంచ పూర్ణాహుతి హోమం, రాత్రి 7 గంటలకు శివమాల భక్తుల అగ్నిగుండ ప్రవేశం, 7.30 గంటలకు అఖండ కర్పూర హారతి, రాత్రిలో భైరవ వాహన సేవ జరుగుతుందని వివరించారు. రాత్రి 12 గంటలకు పాలాభిషేకం జరుగుతుందని తెలిపారు. 19వ తేదీ ఉదయం స్వామి వారి కల్యాణోత్సవం, రాత్రి 7 గంటలకు అశ్వవాహన సేవ, 20వ తేదీ సోమవారం ఉదయం అభిషేకం, ప్రత్యేక పూజలు, రాత్రి రావణబ్రహ్మ వాహన సేవ, 21వ తేదీ రాత్రి అధికారి నంది వాహన సేవ, 22వ తేదీ రాత్రి పుష్ప పల్లకి సేవతో ఉత్సవాలు ముగుస్తాయి.

వేడుకగా చిదంబరేశ్వర స్వామి రథోత్సవం



సాంస్కృతిక ప్రదర్శనల నడుమ ఊరేగుతున్న స్వామివారు



స్వామి వారిని దర్శించుకుంటున్న జెడ్పీ సీఈఓ ప్రభాకర్ రెడ్డి

చిత్తూరు రూరల్: నగరంలోని గిరింపేటలో ఉన్న శ్రీ చిదంబరేశ్వర స్వామి ఆలయంలో శివరాత్రి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా బుధవారం స్వామివారికి అభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక రథంపై స్వామివారిని ఆశీనులు చేసి నగర వీధుల్లో ఘనంగా ఊరేగించారు. సాంస్కృతిక కార్యక్రమాల నడుమ స్వామి వారు ఊరేగుతూ భక్తులకు అభయమిచ్చారు. జెడ్పీ సీఈవో ప్రభాకర్ రెడ్డి స్వామివారిని దర్శించుకున్నారు. వేద పండితులు స్వామికి ప్రత్యేక పూజలు చేశారు.

అధికార నందిపై ఊరేగిన శివపార్వతులు

యాదమరి: మండల కేంద్రంలో వెలసిన శ్రీ ఏకాంబరేశ్వర స్వామి ఆలయంలో శివపార్వతులు ఉదయం అధికార నంది వాహనం, రాత్రి నంది వాహనంపై ఊరేగారు. శివరాత్రిని పురస్కరించుకొని ఏకాంబరేశ్వర స్వామి ఆలయంలో వేకువ జామున ఆలయ అర్చకులు చంద్రశేఖర శర్మ మూలస్థానంలో వెలసిన శివలింగానికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. అనంతరం ఆలయంలోని అలంకార మండపంలో శివపార్వతుల ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక అలంకరణలు నిర్వహించి పూజలు చేసి అధికార నంది వాహనంపై కొలువుదీర్చారు. దేవదేవేర్లు పుర వీధుల్లో ఊరేగుతుండగా భక్తులు కర్పూర మంగళ హారతులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం ఆలయంలో భక్తులకు భజన కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రి అలంకార మండపంలో దేవదేవేరుల ఉత్సవ విగ్రహాలకు అభిషేకాలు అలంకరణలు నిర్వహించి పూజలు చేసి నంది వాహనంపై కొలువు తీర్చారు. మేళ తాళాలతో మంగళవాయిద్యాలతో గ్రామ వీధుల్లో విహరించారు. ఈ పూజాది కార్యక్రమాలకు ఆలయ అర్చకులు, వేదపండితులు పాల్గొన్నారు.

అసైన్‌మెంట్ భూముల గుర్తింపు వేగవంతం



ఏపీయూడబ్ల్యూజే డైరీని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ హరి నారాయణన్

చిత్తూరు కలెక్టరేట్: అసైన్‌మెంట్ భూముల గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ హరి నారాయణన్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో రెవెన్యూకు సంబంధించిన పలు అంశాలపై జాయింట్ కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్, డీఆర్‌వో ఎన్.రాజశేఖర్‌తో కలిసి వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ దళితవాడలలో శ్మశాన వాటికల ఏర్పాటుకు అవసరమైన స్థలాలను సకాలంలో గుర్తించి పంచాయతీలకు అప్పగించాలన్నారు. జిల్లాలో 187 దళితవాడలకు సంబంధించి ఇంకా శ్మశాన స్థలాలను అప్పగించాల్సి ఉందని చెప్పారు. పెండింగ్‌లో ఉన్న మండలాలకు సంబంధించిన తహసీల్దార్లు వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. అసైన్‌మెంట్ చట్టం ప్రకారం జిల్లా వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. జిల్లాలో పలు ప్రాజెక్టులకు సంబంధించి భూ సేకరణ త్వరగా పూర్తి చేయాలన్నారు. రీసర్వే మొదటి దశలో 134 గ్రామాలకు సంబంధించి భూహక్కు పత్రాలు పంపిణీ కార్యక్రమం జరుగుతోందని తెలిపారు. దీనికి ముందే పెండింగ్‌లో ఉన్న అన్ని సమస్యలు పరిష్కరించాలన్నారు. డ్రోన్ సర్వే జరిగిన గ్రామాలకు సంబంధించి మరో 23 గ్రామాలకు ఓఆర్ఐ మ్యాపులు వచ్చినట్లు తెలిపారు. గ్రౌండ్ ట్రూ థింగ్ వేగవంతంగా నిర్వహించాలని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా 6000 సర్వే రాళ్లు సిద్ధంగా ఉన్నాయని అవసరమైన గ్రామాల్లో ఈ కార్యక్రమాన్ని పూర్తి చేయాలని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు చిత్తూరు పలమనేరు, నగరి ఆర్డీఓలు రేణుక, శివయ్య, సృజన, డీఐలు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

ఏపీయూడబ్ల్యూజే డైరీల ఆవిష్కరణ

ఏపీయూడబ్ల్యూజే రూపొందించిన నూతన సంవత్సర డైరీలను కలెక్టర్ హరి నారాయణన్ ఆవిష్కరించారు. కలెక్టరేట్‌లో బుధవారం కలెక్టర్ చేతుల మీదుగా కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ సమాజంలో జరిగే సంఘటనలను ఎప్పటికప్పుడు తెలియజేసే జర్నలిస్టుల సేవలు అభినందనీయమన్నారు. అనంతరం డైరీని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే జిల్లా కన్వీనర్ లోకనాథన్ పౌరసంబంధాల శాఖ డీడీ పద్మజ, సభ్యులు అశోక్‌కుమార్, పవన్‌కుమార్, మహేష్, శివప్రసాద్, బాలసుందరం, ప్రకాష్, నవీన్, మస్తాన్, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

వెల్ఫేర్ అసిస్టెంట్లతో ఎంఈఓ సమీక్ష



మాట్లాడుతున్న ఎంఈఓ వేణుగోపాల్‌రెడ్డి

ఐరాల: విద్యాహక్కు చట్టం ప్రకారం బడిఈడు పిల్లలందరూ పాఠశాలలోనే ఉండాలని ఎంఈఓ వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక ఎమ్మార్సీలో సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లతో ఆయన సమీక్షించారు. డ్రాపౌట్ల వివరాలను సేకరించి వారి అర్హతను బట్టి ఆయా తరగతుల్లో చేర్పించాలన్నారు. గ్రామ స్థాయిలో సర్వశిక్ష అభియాన్ ద్వారా మన బడికి పోదాం కార్యక్రమాలను నిర్వహించి, విస్తృత ప్రచారం చేయాలన్నారు. పిల్లల చదువుల విషయంలో తల్లిదండ్రులకు అవగాహన కల్పించి వారిని తిరిగి పాఠశాలలో చేర్పించేలా చైతన్యం తేవాలన్నారు. బడి ఈడు పిల్లలు, డ్రాపౌట్స్ వివరాల సేకరణకు ప్రత్యేకంగా సర్వే చేయాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

రూ.25 లక్షలకు వాహనాల వేలం



వేలంపాట నిర్వహిస్తున్న అధికారులు

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలో అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన సీజ్ చేసిన వాహనాలను బుధవారం డీఎఫ్ఓ కార్యాలయంలో వేలం పాట ద్వారా విక్రయించారు. వాహనాల కోసం డీడీ, దరఖాస్తు రుసుం చెల్లించి వేలంలో పాల్గొన్నారు. డీఎఫ్ఓలు చైతన్యకుమార్‌రెడ్డి, సోమశేఖర్ ఆధ్వర్యంలో మొత్తం 44 వాహనాలకు వేలం నిర్వహించగా ప్రభుత్వానికి దాదాపు రూ.25 లక్షలు ఆదాయం వచ్చింది. కార్యక్రమంలో ఎఫ్ఆర్వోలు బాలకృష్ణారెడ్డి, థామస్, మదన్‌మోహన్‌రెడ్డి, చంద్రశేఖర్, నయిం, ఎంవీఓ రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కుతూహలమ్మ సేవలు మరువలేనివి



కుతూహలమ్మ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న నాయకులు



కుతూహలమ్మ పార్థివదేహాన్ని సందర్శించి నివాళి అర్పిస్తున్న భూపేష్ గోపినాథ్

గుడిపాల: కుతూహలమ్మ సేవలు మరువలేనివని మండల వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. కుతూహలమ్మ మరణ వార్త తెలిసిన వెంటనే మండల నాయకులు దిగ్భ్రాంతికి గురయ్యారు. మండల కేంద్రంలో బుధవారం ఆమె చిత్రపటం ఏర్పాటు చేసి, పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు జనార్దన్, సుధాకర్ నాయుడు, మధుసూదన్ రెడ్డి, పెద్దబ్బ, బాలిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆదపడుచుగా వ్యవహరించారు

చిత్తూరు కార్పొరేషన్: జెడ్పీ మాజీ చైర్‌పర్సన్‌గా గుమ్మడి కుతూహలమ్మ జిల్లాకే ఆడపడుచుగా వ్యవహరించారని జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. చిత్తూరు రూరల్ పరిధిలోని సొంత గ్రామం తాళంబేడు ప్రాంతంలో ఆమె పలుమార్లు పర్యటించారన్నారు. ప్రస్తుతం అక్కడ ఉన్న జెడ్పీ పాఠశాల, ఉపాధ్యాయ పోస్టుల మంజూరు, ప్రభుత్వ భవన నిర్మాణాలు రావడానికి ఆమె చూపిన చొరవ మరచిపోలేనిదని గుర్తుచేసుకున్నారు. ఆమె ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించారు.

నివాళి

మాజీ మంత్రి గుమ్మడి కుతూహలమ్మ పార్థివదేహానికి మాజీ ఎమ్మెల్యే గోపినాథ్ కుమారుడు భూపేష్ గోపినాథ్ నివాళి అర్పించారు. ఆమె ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించారు. ఆమె డీసీసీ అధ్యక్షురాలిగా, ఎమ్మెల్యేగా, జెడ్పీ చైర్మన్‌గా, మంత్రిగా ఎదిగారని గుర్తుచేసుకున్నారు.

మధ్యాహ్న భోజనంలో నాణ్యత తప్పనిసరి



విద్యార్థులతోకలిసి సహపంక్తి భోజనం చేస్తున్న కమిషనర్ అరుణ

చిత్తూరు అర్బన్: విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనంలో నాణ్యతగా తప్పనిసరిగా ఉండాలని నగర కమిషనర్ అరుణ చెప్పారు. కమిషనర్ బుధవారం మధ్యాహ్నం నగరంలో కట్టమంచి నగరపాలక ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. నిర్వాహకులు సిద్ధం చేసిన మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులతో కలిసి తిన్నారు. రోజూ ఇలానే రుచిగా, మెనూ ప్రకారం అందిస్తున్నారా? కోడిగుడ్డు పెడుతున్నారా అని విద్యార్థులను అడిగి ఆరా తీశారు. అనంతరం కమిషనర్ విద్యార్థుల ఆన్‌లైన్, హాజరు రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. వార్డు కార్యదర్శులు యాప్‌లో అప్లోడింగ్ చేసిన తీరును తనిఖీ చేశారు. రానున్న పదో తరగతి పరీక్షల కోసం విద్యార్థులను పూర్తిస్థాయిలో సిద్ధం చేయాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంఈవో సెల్వరాజ్, సీఎం గోపి, పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు.

దశల వారీగా పరిష్కారం

నగరపాలక సంస్థ పరిధిలోని పారిశుద్ధ్య కార్మికుల సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తామని నగర కమిషనర్ అరుణ తెలిపారు. నగరపాలక కార్యాలయం వద్ద బుధవారం మున్సిపల్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికుల రిలే దీక్షా శిబిరం వద్దకు కమిషనర్ వెళ్లి మాట్లాడారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్య పరిరక్షణకు కృషి

అనంతరం కమిషనర్ మాట్లాడు తూ, పారిశుద్ధ్య కార్మికులకు అందించాల్సిన యూని ఫామ్, సబ్బులు, కొబ్బరి నూనె, చెప్పులు కోసం ఇప్పటికే పలుసార్లు టెండర్లు పిలిచామన్నారు. ప్రత్యామ్నాయంగా జగనన్న మార్ట్ నుంచి అందించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. పారిశుద్ధ్య కార్మికుల కోసం ఈఎస్ఐ కార్డులు సిద్ధంగా చేశామన్నారు. ఇప్పటికే సిద్ధం చేసిన కొన్నింటిని అక్కడికక్కడే కార్మికులకు అందించారు. నగరంలో పారిశుద్ధ్య నిర్వహణలో కార్మికుల పాత్ర ఎంతో ఉందని, వారి ఆరోగ్య పరిరక్షణకు, సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇస్తామన్నారు. మిగిలిన సమస్యలను క్రమం తప్పకుండా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దీక్ష శిబిరం వద్దకు నగర కమిషనర్ స్వయంగా వచ్చి సమస్యలు తెలుసుకుని, పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంపై పారిశుద్ధ్య కార్మికులు, యూనియన్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. కమిషనర్‌కు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఎంహెచ్వో డా.లోకేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు చిన్నయ్య, లోకానాథం, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

బోయకొండకు రూ.1.70 కోట్ల ఆదాయం

చౌడేపల్లి: బోయకొండ గంగమ్మ ఆలయం వద్ద వివిధ హక్కుల నిర్వహణ లీజు కోసం ఏడాది గడువు ఇస్తూ జరిగిన వేలం పాటల ద్వారా రూ.1.70 కోట్లు ఆదాయం వచ్చినట్లు ఆలయ కమిటీ చైర్మన్ మిద్దెంటి శంకర్ నారాయణ తెలిపారు. బుధవారం ఆలయ అడ్మినిస్ట్రేషన్ కార్యాలయంలో 9 హక్కులు పొందే లీజు కోసం వేలం పాటలను నిర్వహించారు. వేలంలో పాల్గొనడానికి వివిధ ప్రాంతాల నుంచి 40 మంది హాజరయ్యారు. ఒక్కొక్కరు రూ.5 లక్షలు ధరావత్తు చెల్లించి, వేలం పాటల్లో పాల్గొన్నారు. గత ఏడాది కంటే ఈ సంవత్సరం రూ.77.44 లక్షలు అదనపు ఆదాయం వచ్చినట్లు చైర్మన్ మిద్దెంటి శంకర్ నారాయణ, ఈఓ చంద్రమౌళి తెలిపారు.

వాయిదా పడిన వేలం పాటలు

ఆలయం వద్ద బుధవారం నిర్వహించిన వేలంలో సరైన మద్దతు ధర రాకపోవడంతో వేలం పాటలను వాయిదా వేసినట్లు ఈఓ చంద్రమౌళి ప్రకటించారు. దేవస్థానం, పంచాయతీకి చెందిన టోల్ వసూలు, తలనీలాలు, పెద్ద భోగం, చిన్న భోగం, కొబ్బరి చిప్పల సేకరణ హక్కులపై వేలం పాటలు వాయిదా వేశారు. వేలం నిర్వహించే తేదీలను త్వరలో ప్రకటిస్తామని ఈఓ పేర్కొన్నారు.